సాక్షి
పెద్దపల్లి
మంగళవారం । 10 । జనవరి । 2023



మొక్కులు అందుకో రాజన్న

రాజన్నను సోమవారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ధర్మగుండంలో స్నానాలు చేసి, తడిబట్టలతో కోడెమొక్కులు, అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణం మొక్కులు చెల్లించుకున్నారు.



పత్తి క్వింటాల్‌కు రూ.8,321

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం పత్తి క్వింటాల్‌కు గరిష్టంగా రూ.8,321 పలికింది. కనిష్టంగా రూ.7,201, సగటున రూ.8,262గా నమోదైనట్లు ప్రత్యేక శ్రేణి కార్యదర్శి దేవరాజ్ పృథ్వీరాజ్ తెలిపారు.

గరిష్టం/కనిష్టం
28.0 /12.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది.
పొగమంచు కురుస్తుంది.
చలిగాలులు కొనసాగుతాయి.

న్యూస్‌రీల్

సర్పంచుల అరెస్ట్ అప్రజాస్వామికం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

మంథని: రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధ పాలన కొనసాగిస్తోందని, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని ఏఐసీసీ కార్యదర్శి, మంథని ఎమ్మెల్యే డి.శ్రీధర్‌బాబు అన్నారు. మంథనిలోని తన క్యాంప్ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సమస్యలు పరిష్కరించాలని ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలియజేయడానికి వెళ్తున్న సర్పంచ్‌లను అరెస్టు చేయడం సరికాదన్నారు. స్థానిక సంస్థలకు నిధులు కేటాయించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేయడానికే పని చేస్తున్నాయన్నారు. నాలుగునెలల నుంచి పంచాయతీలకు రూ.1250 కోట్లు స్టేట్ ఫైనాన్స్ నుంచి రావాల్సి ఉందని, 15 ఫైనాన్స్ కమిషన్ నుంచి రూ.35,000కోట్లను పక్కదారి పట్టించిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కళ్లు తెరిచి గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు తోడ్పాటు అందించాలని సూచించారు. పార్టీ మండల అధ్యక్షుడు సెగ్గెం రాజేశ్, కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర కో–ఆర్డినేటర్ శశిభూషణ్ కాచే, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతి యాదవ్, భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు ఐత ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు.

హాస్టల్‌వార్డెన్ పరీక్షకు ఉచిత శిక్షణ

పెద్దపల్లిరూరల్: హాస్టల్ వార్డెన్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులకు బీసీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు బీసీ సంక్షేమశాఖ జిల్లా అధికారి రంగారెడ్డి తెలిపారు. ఉచిత శిక్షణ పొందగోరే వారు ఈనెల 12లోగా దరఖాస్తు చేసుకోవాలని, వారికి కరీంనగర్‌లోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఉద్యోగ, నైపుణ్య అభివృద్ధిపై శిక్షణ ఇస్తారని వివరించారు. పూర్తి వివరాలకు 0878–2268686 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



ప్రిన్సిపాల్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ అసోసియేషన్ ముద్రించిన క్యాలెండర్‌ను కలెక్టర్ సంగీత ఆవిష్కరించారు. అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్, డీఐఓ కల్పన, ప్రిన్సిపాల్స్ సుదర్శన్, సలీం, విశ్వప్రసాద్, మైత్రేయి, సునంద, అంజయ్య ఉన్నారు.









వామ్మో చలి..!

జిల్లాలో మూడురోజులుగా చలి విజృంభిస్తోంది. మొన్నటివరకు కనిష్ట ఉష్ణోగ్రతలు 19 నుంచి 20 డిగ్రీల వరకు నమోదుకాగా.. రెండు రోజులుగా 10 నుంచి 11 డిగ్రీలకు చేరాయి. ఉదయం వేళ పొగమంచు కమ్ముకుంటోంది. రోడ్లపై వెళ్లే వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. చలి కారణంగా ఉదయం పదిగంటలు దాటినా ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావడం లేదు. రైతులు, చిరువ్యాపారులు స్వెట్టర్లు, మఫ్లర్లు ధరించి వెళ్తున్నారు. **– సాక్షి, ఫొటోగ్రాఫర్, పెద్దపల్లి**

గౌతమి ట్రస్ట్‌కు వరల్డ్‌బుక్ ఆఫ్ రికార్డులో చోటు



సర్టిఫికెట్ అందుకుంటున్న సోమారపు లావణ్య

ఫెర్టిలైజర్‌సిటీ: రామగుండం కార్పొరేషన్ 39వ డివిజన్ శాంతినగర్‌లోని గౌతమిరూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ జాతీయస్థాయిలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో ఒకే సమయంలో 200 మంది యువకులు రక్తదానం చేయడంతో వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సాధించింది. సోమవారం ట్రస్ట్ నిర్వాహకులు సోమారపు లావణ్యకు వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్ సర్టిఫికెట్, అంతర్జాతీయ లైఫ్ సేవర్ అవార్డును స్థానిక ప్రతినిధి యాదవ రాజు అందించారు. కార్యక్రమంలో శిరీష, మహిళలు పాల్గొన్నారు.

పీఎంశ్రీ.. స్కూళ్లకు వరం..!

- జిల్లానుంచి 99 పాఠశాలలకు ప్రతిపాదనలు
- అందులో రాష్ట్రస్థాయికి ఎంపికైనవి 41
- ఎంపికైతే మూడేళ్లలో రూ.46లక్షల నిధులు
- ఆధునిక పద్ధతుల్లో బోధన



పెద్దపల్లిరూరల్: జాతీయస్థాయి విద్యా ప్రమాణాలను అందుబాటులోకి తెచ్చేలా కేంద్ర ప్రభుత్వం రూపొందించిన పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా) పథకం కింద ఎంపికయ్యే పాఠశాలకు మహర్దశ పట్టనుంది. ఈ పథకం కింద ఎంపికయ్యేందుకు ఉన్న మార్గదర్శకాలకు అనుగుణంగా యూడైస్ విధానం కింద 99 పాఠశాలలు పోటీపడ్డాయి. అందులో 12 మండలాల నుంచి 41 పాఠశాలలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారని విద్యాశాఖవర్గాలు తెలిపాయి.

యూడైస్ విధానంలో ఎంపిక

యునిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్‌ఫర్మేషన్ సిస్టం ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ (యూడైస్) ప్రోగ్రాం కింద కేంద్ర ప్రభుత్వం అమలు చేసే పీఎంశ్రీ పథకం అమలుకు ముందుకొచ్చిన పాఠశాలల సమాచారం కోసం ఆయా స్కూళ్ల హెచ్‌ఎంలకు యూజర్ ఐడీ, లాగిన్ పంపించారు. తమ మొబైల్ ద్వారా అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు.

అధికారులు అడిగిన అంశాలు

పాఠశాలకు సొంత భవనం ఉందా..? విద్యార్థుల నమోదు..? మరుగుదొడ్ల సదుపాయం..? తాగునీరు, చేతులు శుభ్రం చేసుసుకునే వసతి..? విద్యుత్ సౌకర్యం, గ్రంథాలయం వసతి..? ఎల్‌ఈడీ బల్బులు అమర్చుకున్నారా..? కిచెన్‌షెడ్ ఉందా..? పేరెంట్స్, టీచర్స్ మీటింగులు జరుగుతున్నాయా..? వంటి ప్రశ్నలు అడిగి మార్కులు కేటాయించి వాటి ఆధారంగా మెరుగైన ఫలితాలుగా భావించిన 41 పాఠశాలలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు.

ఎంపికైతే కార్పొరేట్ స్థాయిలో బోధన

“ పీఎంశ్రీ పథకం కింద ఎంపికైన పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో బోధన జరగనుంది. గ్రామస్థాయి విద్యార్థులకు జాతీయస్థాయి విద్యాప్రమాణాలతో కూడిన బోధనను అందించి డిగ్రీ స్థాయిలోనే ఉపాధి అవకాశాలు పొందేలా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకునే అవకాశాలున్నాయని సమాచారం. డిజిటలైజేషన్ బోధనలో భాగంగా కంప్యూటర్లు ఏర్పాటు చేస్తారు. ఎంపికైన పాఠశాలల్లో సిలబస్‌తో పాటు బోధనా పద్ధతుల్లో మార్పులు రానున్నాయి. ఒక్కో బడికి రూ.46 లక్షల నిధులను మూడేళ్లలో సమాకూర్చనున్నారు. వర్చువల్ రియాలిటీ పద్ధతిన విద్యార్థులకు అవగాహన కల్పించనున్నారు.

తొలిదశలో ఎంపికైన పాఠశాలలివే

జిల్లాలోని ఎలిగేడు, పాలకుర్తి మండలాలు మినహా మిగతా అన్ని మండలాల నుంచి పాఠశాలలు తొలిదశలో ఎంపికయ్యాయి. పెద్దపల్లి మండలంలోని అప్పన్నపేట జెడ్పీ హైస్కూల్, ఎంపీపీఎస్, గౌరెడ్డిపేట ఎంపీయూపీఎస్, కొత్తపల్లి ఎంపిపిఎస్‌తో పాటు మరో 37 పాఠశాలలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి.

ఎంపికైన స్కూళ్లకే...

పీఎంశ్రీ పథకం కింద జిల్లాలోని 99 పాఠశాలలను ప్రతిపాదించగా.. మార్కుల ఆధారంగా తొలిదశలో 41 పాఠశాలలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. వాటిలో ఈ పథకం కింద యూడైస్ నిబంధనలకు లోబడి మెరుగ్గా ఉన్న వాటిలో ఎంపికైన పాఠశాలలకు ప్రత్యేకంగా నిధులొస్తాయి. జాతీయస్థాయి ప్రమాణాలకనుగుణంగా బోధన సాగుతుంది.

– శ్రీనివాస్, సెక్టోరల్ అధికారి



ఈమె పేరు వెంగల స్వరూప. ఊరు సుల్తానాబాద్ మండలం మియాపూర్. ఊరిపేరిట మంజూరైన రేషన్ దుకాణాన్ని శివారు గ్రామమైన పెర్కపల్లిలో నడుపుతున్నారు. రేషన్ సరుకుల కోసం లబ్ధిదారులంతా దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న పెర్కపల్లికి వెళ్లి తెచ్చుకోవడం ఇబ్బందిగా ఉంది. తమ గ్రామానికి మరో డీలర్‌ను నియమించి తమ ఇబ్బందులు దూరం చేయాలని కోరుతున్నారు. ఒక్క స్వరూపదే కాదు.. జిల్లాలో కొత్తగా ఏర్పాటైన మండలాలతోపాటు శివారు గ్రామాల ప్రజలందరిదీ. రేషన్ బియ్యం పంపిణీ చేసే రేషన్ దుకాణాలు అందుబాటులో లేక అవస్థలు పడాల్సి వస్తోంది. తమ గ్రామంలోనే డీలరును నియమించి గ్రామస్తుల ఇబ్బందులను దూరం చేయాలంటూ అభ్యర్థనలు అందుతున్నాయి.

శివారు పల్లెల్లో రేషన్ షాపులు

- కొత్తగా 11 దుకాణాలు ఏర్పాటు
- డీలర్ల ఎంపికకు అధికారుల సన్నద్ధం



జిల్లాలో ప్రస్తుత రేషన్ షాపులు	413
రేషన్ కార్డులు	2,10,147
అంత్యోదయ	12,297

పెద్దపల్లిరూరల్: శివారు పల్లెలు, కొత్త పంచాయతీల్లో 20 రేషన్ దుకాణాల ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదించారు. అయితే రేషన్‌కార్డుల సంఖ్య చాలా తక్కువగా ఉందనే కారణంతో 9 దుకాణాల ప్రతిపాదనలను రెవెన్యూ అధికారులు తిరస్కరించారు. దీంతో జిల్లాలో 11 రేషన్ దుకాణాలు ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

తప్పని బాధలు

జిల్లాలోని 14 మండలాల్లో కొత్తగా 65 పంచాయతీలు కొత్తగా ఏర్పడ్డాయి. దీంతో లబ్ధిదారులు తమ సమీపంలోని గ్రామానికి వెళ్లి రేషన్ తెచ్చుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఇంకా కొన్ని పంచాయతీలకు అనుబంధంగా ఉన్న గ్రామాల ప్రజలకూ దూరభారం తప్పడం లేదనే వాదనలున్నాయి. అధికారులు చొరవ చూపి పంచాయతీల పరిధిలోని శివారు గ్రామాల ప్రజలకు సంబంధించిన కోటాను ఆ పల్లెల్లోనే అందించేలా చర్యలు తీసుకుంటే మరో డీలరు అవసరం లేకుండా లబ్ధిదారులకు బాధ కలగకుండా ఉంటుందని, ఈ దిశగా ఆలోచించాలని పలువురు కోరుతున్నారు.

కొత్తగా ఏర్పాటయ్యే దుకాణాలివే..

అంతర్గాం మండలంలో ఎల్లంపల్లి, అంతర్గాం, జూలపల్లి మండలంలో నాగులపల్లి, పాలకుర్తి మండలంలో కుక్కలగూడురు, గుంటూరుపల్లి (లక్ష్మీపురం), సుభాష్‌నగర్, ఈసాలతక్కల్లపల్లి, రామగిరి మండలంలో బేగంపేట, కల్వచర్ల, రామగుండం మండలంలో సప్తగిరికాలనీ, సుల్తానాబాద్ మండలంలో కందునూరిపల్లి గ్రామాల్లో షాపుల ఏర్పాటుకు మార్గం సుగమమైంది.

ఇబ్బందులు కలగొద్దనే...



ప్రభుత్వం పేదలకు అందించే సబ్సిడీ సరుకులను సులువుగా పొందేలా డీలర్లను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. కొత్తగా 20 రేషన్ దుకాణాల ఏర్పాటుకు ప్రతిపాదించాం. ప్రస్తుతానికి 11 దుకాణాలు ఏర్పాటవుతాయి. – వెంకటేశ్, డీఎస్‌ఓ

- స్టీరింగ్ స్టక్ అయి చెట్టుకు ఢీకొట్టిన వైనం
- 18 మంది ప్రయాణికులకు గాయాలు
- ప్రమాద సమయంలో బస్సులో 41 మంది
- సహాయక చర్యల్లో మంథని ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు
- క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించిన మున్సిపల్ చైర్‌పర్సన్ శైలజ

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు





గాయపడిన వారికి వైద్యం అందిస్తున్న వైద్యులు

మంథని: మంథని–కాటారం ప్రధాన రహదారిపై.. అడవిసోమన్‌పల్లి–నాగేపల్లి సమీపంలో ఆర్టీసీ బస్సు అదుపుతప్పి చెట్టుకు ఢీకొట్టిన సంఘటనలో బస్సులో ఉన్న 18 మంది ప్రయాణికులు గాయపడ్డారు. మరో పదిమందికి స్వల్ప గాయాలయ్యాయి. ఎనిమిది మందికి తల, ఇతర శరీర భాగాలకు గాయాలు కావడంతో వారిని కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు. సంఘటనకు సంబంధించిన వివరాలు.. మంథని ఆర్టీసీ డిపోకు చెందిన బస్సు మంథని నుంచి జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని తాడిచర్లకు 41 మంది ప్రయాణికులతో బయల్దేరింది. నాగేపల్లి సమీపంలోకి రాగానే బస్సు స్టీరింగ్ స్టక్ కావడంతో అదుపు తప్పి రోడ్డుకు అడ్డంగా తిరిగింది. డ్రైవర్ గోపాల్ ప్రమాదాన్ని గుర్తించి బ్రేకులు వేయగా.. పక్కనే ఉన్న చెట్టుకు ఢీ కొట్టింది. ఈ ఘటనలో గాయపడిన వారిని మంథని సామాజిక వైద్యశాలకు తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. గాయపడిన వారంతా జయశంకర్‌భూపాలపల్లి జిల్లా, ఎన్టీపీసీకి చెందినవారు. మల్లారానికి చెందిన రావుల స్వరూప, గాదంపల్లికి చెందిన నల్లాల శారద, చిన్నతూండ్లకు చెందిన సరోజన తలకు బలమైన గాయాలు అయ్యాయి. మల్లారానికి చెందిన దేనవేన అశ్విని పళ్లు విరిగాయి. గాదంపల్లికి చెందిన తిరుపతి ప్రియాంక, ఆమె తల్లి విజయ, రెండు నెలల చిన్నారి స్వల్ప గాయాలతో బయటపడింది. క్షతగాత్రులు 18 మందిని సామాజిక ఆసుపత్రికి తీసుకురాగా ఆస్పత్రి ఇన్‌చార్జి శ్రీనివాస్‌రెడ్డి మాతా శిశు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతోపాటు ప్రైవేటు ఆస్పత్రుల వైద్యులను పిలిపించి వైద్య సేవలు అందించారు.



ప్రమాదానికి గురైన బస్సు



సహాయక చర్యలో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

సహాయక చర్యల్లో ఎమ్మెల్యే శ్రీధర్‌బాబు

కాటారం పర్యటనకు వెళ్లి మంథని వస్తున్న ఎమ్మెల్యే శ్రీధర్‌బాబుకు మార్గంమధ్యలో ప్రమాదం కనిపించడంతో అక్కడే ఆగి.. క్షతగాత్రుల సహాయక చర్యల్లో పాల్గొన్నారు. బాధితులను తన వాహనాలతోపాటు తన పార్టీ నాయకుల వాహనాల్లో ఆస్పత్రులకు తరలించారు. మిగిలిన ప్రయాణికులను మరో బస్సును రప్పించి వారివారి గ్రామాలకు పంపించారు. గాయాలతో వచ్చిన వారికి మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ దగ్గరుండి వైద్య పరీక్షలు చేయించారు. ఎనిమిది మందిని కరీంనగర్‌లోని ఆస్పత్రులకు పంపించారు. మంథని ఎస్సై వెంకటేశ్వర్లు సంఘటనా స్థలానికి చేరుకుని పెద్ద ఎత్తున నిలిచిపోయిన ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. రెండో ఎస్సై రాణివర్మ సామాజిక వైద్యశాలలో సేవలందించారు.

ప్రజావాణికి రెవెన్యూ సమస్యలే అధికం..!



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సంగీత, ఇతర అధికారులు

- 73 వినతుల్లో.. 65 భూసంబంధమైనవి
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ సంగీత
- పరిష్కరించాలని అధికారుల ఆదేశాలు



మాది మంథని మండలం చిన్న ఓదాల గ్రామం. గ్రామ శివారులోని సర్వే నంబరు 229లో ఉన్న సీలింగ్ భూమిని చాలాకాలంగా ధాన్యం ఆరబోసుకునేందుకు వినియోగించుకుంటున్నాం. ఆ భూమిని రైతులకు ఉపయోగపడేలా ధాన్యం కొనుగోలు కేంద్రానికి కేటాయించాలి. **– వేముల లక్ష్మయ్య, సతీశ్, లింగయ్య, బుచ్చయ్య, బాపు**

పెద్దపల్లిరూరల్: ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా బాధితులు తరలివచ్చారు. తమ సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్ సంగీతకు అర్జీలు సమర్పించారు. జిల్లావ్యాప్తంగా 73 అర్జీలు రాగా.. ఇందులో 65 అర్జీలు భూ సంబంధమైనవే కావడం గమనార్హం. ముత్తారం మండలం లక్కారానికి చెందిన దశరథం రాంబాబు తాను మావోయిస్టు నుంచి జన జీవన స్రవంతిలో కలిశానని, తనకు కాల్వశ్రీరాంపూర్ మండలం రాతుపల్లిలో భూమి కేటాయించాలని కోరాడు. అడిషనల్ కలెక్టర్లు లక్ష్మీనారాయణ, కుమార్‌దీపక్ తదితరులు బాధితుల నుంచి అర్జీలు స్వీకరించారు. ప్రజావాణిలో అందిన ఫిర్యాదులపై సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ సంగీత ఆదేశించారు. నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చర్యలు తప్పవన్నారు.

ఇల్లు ఇప్పించండి



మాది నిరుపేద కుటుంబం. మాకు ఏ ఆధారమూ లేదు. నివసించేందుకు డబుల్‌బెడ్ రూం ఇల్లు ఇప్పించి ఆదుకోండి. – ఆరెపల్లి జంపయ్య, రంగంపల్లి

దుర్వాసన భరించలేకున్నం



పెద్దపల్లి మండలం హన్మంతునిపేటలో నివాసముంటున్నం. మా ఇంటి చుట్టూ పందులకు స్థిరనివాసం ఏర్పాటు చేశారు. వాటి దుర్వాసన భరించలేకున్నం. పంట చేలను కూడా పందులు పాడుచేస్తున్నయ్. ఇళ్ల మధ్య పందులు నివాసం లేకుండా చూడాలి.

– తీగల మహేందర్, హన్మంతునిపేట

సింగరేణి జోలికొస్తే ఊరుకోం

గోదావరిఖని: బొగ్గు బ్లాకుల ప్రైవేటీకరణ పేరుతో సింగరేణి జోలికొస్తే ఊరుకునేది లేదని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హెచ్చరించారు. సోమవారం జీడీకే–11వ గనిపై ఏర్పాటు చేసిన బాయిబాటలో మాట్లాడారు. తెలంగాణకు ఆయువుపట్టు అయిన సింగరేణి ఉసురు తీసేందుకు కేంద్రం కుట్ర పన్నుతోందన్నారు. సింగరేణి సంస్థకు చెందిన కేకే–5, పెనగడప, శ్రావనపల్లి, సత్తుపల్లి బ్లాకుల వేలం వెంటనే నిలిపివేయాలన్నారు. సంస్థ ప్రైవేట్‌పరం కాకుండా కాపాడుకునేందుకు ఈ ప్రాంతం నుంచే మరో పోరాటానికి శ్రీకారం చుట్టామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు, తెలంగాణ వికాస సమితి ఉపాధ్యక్షుడు విజయానంద్, యూనియన్ నాయకులు గండ్ర దామోదర్‌రావు, కనకం శ్యాంసన్, జాహిద్‌పాషా, యాదవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



బాయిబాటలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

క్లుప్తంగా

చికిత్స పొందుతూ యువకుడు మృతి


రమేశ్(ఫైల్)

కాల్వశ్రీరాంపూర్(పెద్దపల్లి): మండల కేంద్రానికి చెందిన రాదారపు రమేశ్ (25) చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసుల వివరాలు.. మద్యానికి బానిసైన రమేశ్‌ను ఆదివారం రాత్రి తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. వెంటనే కాల్వశ్రీరాంపూర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. తండ్రి గట్టుస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజవర్ధన్ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ధర్మారం(ధర్మపురి): మండలంలోని కటికెనపల్లి గ్రామశివారు కొచ్చగుట్ట వద్ద సోమవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. గొర్రెల కాపరి సమాచారం మేరకు ఎస్సై ఆధ్వర్యంలో పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా మృతదేహం పూర్తిగా కుళ్లిపోయి ఉందని, కరీంనగర్‌లోని మార్చురీకి తరలించినట్లు పేర్కొన్నారు. కాగా గుర్తు తెలియని మృతదేహంపై చొప్పదండికి చెందిన వ్యక్తిగా అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

ఉరేసుకొని వృద్ధుడి ఆత్మహత్య

ధర్మారం(ధర్మపురి): మండల కేంద్రానికి చెందిన బోయిని గంగారాం (65) అనారోగ్యంతో జీవితంపై విరక్తి చెంది సోమవారం తెల్లవారుజామున ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న గంగారాం మందులు వాడినా నయం కాలేదు. దీంతో జీవితంపై విరక్తితో ఇంట్లో ఎవరూలేని సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి కుమారుడు నరేష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు పిల్లలతో వివాహిత ఆత్మహత్యాయత్నం

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): మంచిర్యాల జిల్లా నస్పూర్‌కు చెందిన ఓ వివాహిత (30)తన ఇద్దరు పిల్లలతో సోమవారం గోదావరినదిలో దూకి ఆత్మహత్య చేసుకునేందుకు యత్నించింది. గోదావరిఖని టూటౌన్ పోలీసులు, స్థానికులు, రివర్ పోలీసుల వివరాలు.. కుటుంబ కలహాలతో మనస్తాపానికి గురైన వివాహిత తన ఇద్దరు చిన్నారులను తీసుకొని గోదావరి బ్రిడ్జి వద్దకు వచ్చి నదిలో దూకింది. అటు నుంచి వస్తున్న వాహనదారుడు గమనించి వారిని కాపాడేందుకు తను కూడా నదిలో దూకాడు. అక్కడే విధులు నిర్వహిస్తున్న రివర్ పోలీసులు, జాలర్లు తాడు, పడవ సాయంతో వారిని ఒడ్డుకు చేర్చారు. వెంటనే 108 అంబులెన్స్‌లో గోదావరిఖని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కౌన్సెలింగ్ చేసి కుటుంబ సభ్యులకు అప్పగించారు. కాగా ఎవరికీ ఎలాంటి ప్రాణపాయం లేదని తెలిపారు. వెంటనే స్పందించి కాపాడిన రివర్ పోలీస్ సదానందం, హోంగార్డు శ్రీధర్, వాహనదారుడిని టూటౌన్ సీఐ వేణుగోపాల్ అభినందించారు.

దుష్ప్రచారం మానుకోవాలి

- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాజారెడ్డి


గేట్‌మీటింగ్‌లో మాట్లాడుతున్న రాజారెడ్డి

గోదావరిఖని(రామగుండం): వేతన ఒప్పందంపై దుష్ప్రచారం మానుకోవాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి సూచించారు. సోమవారం ఏరియా వర్క్‌షాప్‌లో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో మాట్లాడారు. 19శాతం వేతన పెరుగుదలతో 11వ వేతన ఒప్పందం సాధించడం కార్మికుల విజయంగా భావిస్తున్నామని, గతంలో ఒకటో కేటగిరీ వేతనం రూ.4వేలు పెరగగా 11వ వేతన ఒప్పందంలో రూ.6,973.73 పెరుగుదల ఉంటుందన్నారు. పదో వేతన ఒప్పందంలో ఒకటవ కేటగిరీ బేసిక్ రూ.1,011.27 ఉండగా 11వ వేతన ఒప్పందంలో రూ.1,502.67 పెరుగుతుందన్నారు. వేతన ఒప్పందాల విషయంలో అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. బాయిబాట పేరుతో సింగరేణి బొగ్గు బ్లాక్‌ల రక్షణ కోసం పోరాడుతున్నామని చెబుతున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే సింగరేణి కార్మికుల తాగునీటి సమస్య పరిష్కరించకుండా జేబీసీసీఐలో జరిగిన ఒప్పందాలపై మాట్లాడుతున్నారన్నారు. రామగుండం నియోజకవర్గ ప్రజలకు న్యాయం చేస్తామని ఇండిపెండెంట్‌గా గెలిపిస్తే బీఆర్ఎస్ ప్రభుత్వంలో చేరి ప్రజలను మోసం చేశారన్నారు. ఎమ్మెల్యే వ్యవహార శైలిని సింగరేణి కార్మికులు పూర్తిస్థాయిలో గమనిస్తున్నారన్నారు. ఇప్పటికైనా సింగరేణి కార్మికుల హక్కుల రక్షణకు తెలంగాణలోని బొగ్గు బ్లాక్‌ల అమ్మకాన్ని వ్యతిరేకిస్తూ అన్ని ట్రేడ్ యూనియన్లు పార్టీలతో, ప్రజలతో కలిసి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు మెండె శ్రీనివాస్, ఆసరి మహేష్, ఆరెపల్లి రాజమౌళి, ఎస్కే గౌస్, నంది నారాయణ, మల్యాల శ్యామల, ఇప్పలపల్లి సతీష్‌కుమార్, ప్రవీణ్, ఓదెలు, లక్ష్మణ్, నాగిరెడ్డి, సంతోష్‌కుమార్, కార్మికులు పాల్గొన్నారు.

సెమీస్కిల్డ్ వేతనాలు చెల్లించాలి


మాట్లాడుతున్న వెంకన్న

రామగిరి(మంథని): సింగరేణిలో పని చేస్తున్న బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు సెమీస్కిల్డ్ వేతనాలు చెల్లించాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల వెంకన్న డిమాండ్ చేశారు. సెంటినరీకాలనీలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులకు సెమీస్కిల్డ్ వేతనాలు చెల్లించాలని ఇప్పటికే చాలాసార్లు సింగరేణి అధికారులకు వినతి పత్రాలు అందించినా ఎలాంటి స్పందన రాలేదన్నారు. సెమీస్కిల్డ్ వేతనాలు చెల్లించాలనే డిమాండ్ చేస్తూ ఈనెల 11న ఆర్జీ–3, ఏపీఏ జీఎం కార్యాలయం ఎదుట చేపట్టనున్న ధర్నా కార్యక్రమంలో బెల్ట్ క్లీనింగ్ కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం కార్యదర్శి సుద్దాల మనోజ్, బెల్ట్ క్లీనింగ్ కార్మికులు సత్తి, తిరుపతి, శంకర్, మల్లన్న, మధునయ్య, రాజన్న, మురళి, నవీన్ పాల్గొన్నారు.

జీఎం కమిటీ సభ్యులకు సన్మానం


కమిటీ సభ్యులను సన్మానిస్తున్న నాయకులు

గోదావరిఖనిటౌన్(రామగుండం): ఆర్జీ–1 ఏరియా జీఎం కమిటీ సభ్యులుగా ఎన్నికైన మండ రమేష్‌గౌడ్, జనగామ శ్రీనివాస్‌గౌడ్‌ తెలంగాణ గౌడ సంఘం రామగుండం కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానిక చౌరస్తాలో సన్మానించారు. తెలంగాణ గౌడ సంఘం కార్పొరేషన్ అధ్యక్షుడు గడ్డం శ్యాంకుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కోట రవిగౌడ్, సిటీకేబుల్ ఎండీ బాలసాని స్వామిగౌడ్, కో ఆప్షన్ సభ్యుడు వంగ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు పల్లెర్ల రమేష్‌గౌడ్, పొన్నం విజయ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మదర్‌థెరిస్సా కాలేజీలో రిక్రూట్‌మెంట్ డ్రైవ్


రిక్రూట్‌మెంట్ డ్రైవ్‌కు హాజరైన విద్యార్థులు

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మదర్‌థెరిస్సా ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం ఆన్ క్యాంపస్ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. పూణేకు చెందిన అలోహ టెక్నాలజీ ఆధ్వర్యంలో జరిగిన రిక్రూట్‌మెంట్‌కు 150 మంది విద్యార్థులు హాజరయ్యారు. తమ కాలేజీలో చదివిన విద్యార్థులు పేరొందిన కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికవుతున్నారని కళాశాల చైర్మన్ ఎడవల్లి నవీన్, డైరెక్టర్ నవత తెలిపారు. అలోహ కంపెనీ వారు ముందుకు రావడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో అలోహ హెచ్ఆర్ జోయల్‌తో పాటు ప్రిన్సిపాల్ శ్రీనివాస్, ఏఓ నరేశ్‌కుమార్, పవన్‌కుమార్, పలు విభాగాల హెచ్ఓడీలు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఆయన నేత్రాలు సజీవం


తిరుమల్‌రెడ్డి(ఫైల్)

యైటింక్లయిన్ కాలనీ(రామగుండం): రామగుండం కార్పొరేషన్ పోతనకాలనీలో నివాసం ఉంటూ సింగరేణి ఓసీపీ–3లో విధులు నిర్వహిస్తున్న తుమ్మల తిరుమల్‌రెడ్డి(42) సోమవారం గుండెపోటుతో మృతి చెందాడు. ఆయన నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకు వచ్చారు. సదాశయ ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి ఆధ్వర్యంలో టెక్నీషియన్ ఆరిఫ్‌తో నేత్రాలు సేకరించి హైదరాబాద్‌లోని వాసన్ ఐ బ్యాంకుకు తరలించారు. సమాజహితం కోసం ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించేందుకు మృతుడి నేత్రాలను దానం చేసేందుకు ముందుకు వచ్చిన కుటుంబ సభ్యులు తిరుమల్‌రెడ్డి భార్య రమాదేవి, కూతుళ్లు దీక్షిత్‌రెడ్డి, తనిష్కరెడ్డి, సోదరుడు సురేందర్‌రెడ్డిలను ఫౌండేషన్ అధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, మారెల్లి రాజిరెడ్డి, రాంరెడ్డి, రమేశ్‌రెడ్డి, సురేశ్‌రెడ్డి, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రాజేందర్ తదితరులు అభినందించారు.

వైండింగ్ షాపులో చోరీ

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): సుల్తానాబాద్‌లోని రైస్‌మిల్ అసోసియేషన్ సమీపంలో రాజీవ్ రహదారిని ఆనుకొని ఉన్న వైండింగ్ షాపులో ఆదివారం రాత్రి చోరీ జరిగింది. షాపులోని సుమారు ఒక క్వింటాల్ రాగి తీగను ఎత్తుకెళ్లినట్లు బాధితుడు సంపత్ తెలిపాడు. దీని విలువ దాదాపు రూ.ఒక లక్ష వరకు ఉంటుందని పేర్కొన్నాడు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ ఉపేందర్‌రావు తెలిపారు.

వైద్య కళాశాలకు 16 కొత్త పోస్టులు

కోల్‌సిటీ(రామగుండం): రామగుండం వైద్య కళాశాలకు 16 కొత్త ట్యూటర్ పోస్టులు కేటాయిస్తూ సోమవారం రాష్ట్ర ఆరోగ్య, వైద్య, కుటుంబ సంక్షేమశాఖ, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. కాంట్రాక్ట్ పద్ధతిన వీరి సేవలను ఈ ఏడాది మార్చి 31వరకు వినియోగించుకోనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. రెగ్యులర్ పోస్టులు భర్తీ అయ్యేవరకూ వీరు పని చేయాల్సి ఉంటుంది.

కార్గో సేవలపై ప్రచారం


ప్రచారం చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

కాల్వశ్రీరాంపూర్: ఆర్టీసీ కార్గో సేవలు వినియోగించుకోవాలని కోరుతూ ఆర్టీసీ సిబ్బంది సోమవారం కాల్వశ్రీరాంపూర్‌లో ఇంటింటా ప్రచారం చేశారు. ఇతర ట్రాన్స్‌పోర్టుల కన్నా చౌకగా, వేగంగా కోరుకున్న ప్రాంతాలకు సరుకులు రవాణా చేస్తున్నామని, రైతులు, ప్రజలు, వ్యాపార, వాణిజ్య వర్గాలు తమ ఉత్పత్తులు, వస్తువుల రవాణాకు కార్గో సేవలను వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ రామకృష్ణ, కాల్వశ్రీరాంపూర్ ఇన్‌చార్జి అశోక్, ఏజెంట్ భాస్కర్, సదానందం పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని పద్మనగర్ బైపాస్ రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాలు.. సంతోష్‌నగర్‌కు చెందిన రత్నాకర్ ద్విచక్రవాహనాన్ని ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే ప్రభుత్వ ప్రధానాస్పత్రికి తరలించారు.

విపత్తుల నిర్వహణపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

- ఈనెల 24 వరకు ఎన్డీఆర్ఎఫ్ బృందంతో శిక్షణ
- అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ

పెద్దపల్లిరూరల్: జిల్లాలో విపత్తులు సంభవిస్తే సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన శిక్షణ పొంది, ప్రజలకు అవగాహన కల్పించాలని అడిషనల్ కలెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో జరిగిన కార్యక్రమంలో ఎన్డీఆర్ఎఫ్ బృందం ద్వారా విపత్తులను ఎదుర్కొనే విషయమై సమీక్షించారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని సర్వసన్నద్ధంగా ఉండాలన్నారు. ఈ నెల 24వరకు అవగాహన కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. లోతట్టు ప్రాంతాలైన మంథని, అంతర్గాం, రామగుండం ప్రాంతాల్లో కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. 10వ బెటాలియన్ బృందం ఇన్‌స్పెక్టర్ బిట్టన్‌సింగ్ ఆధ్వర్యంలో 18మంది సభ్యులు జిల్లాకు వచ్చారని వివరించారు. సమావేశంలో సింగరేణి డెప్యూటీ కలెక్టర్ నర్సింహమూర్తి తదితరులున్నారు.

జాతీయ కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


పతకాలు సాధించిన విద్యార్థులతో మాస్టర్లు

మంథని: హనుమకొండ కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 8న నిర్వహించిన జాతీయ కరాటే పోటీల్లో మంథని విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్లు కరాటే శిక్షకుడు కావేటి సమ్మయ్య తెలిపారు. జపాన్ సిటోరియా కరాటే అకాడమీ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరిచారు. కటా విభాగంలో ఎం.మణిదీప్, కుమితి విభాగంలో కె.అశ్వినిబాబు బంగారు పతకాలు సాధించారు. ఓపెన్ కుమితి బాలికల విభాగంలో హాసిని గ్రాండ్ చాంపియన్ కైవసం చేసుకుంది. పోటీల్లో ఏడుగురు పాల్గొనగా రెండు బంగారు పతకాలు, గ్రాండ్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నట్లు తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులను జపాన్ సిటోరియ కరాటే రాష్ట్ర అధ్యక్షుడు పి.పాపయ్య, సీనియర్ కరాటే మాస్టర్లు సంపత్, రవి అభినందించారు.

చదరంగ పోటీల్లో ప్రథమ బహుమతి


రవీందర్‌సింగ్ చేతులమీదుగా బహుమతి అందుకుంటున్న విశాల్

ఎలిగేడు(పెద్దపల్లి): కరీంనగర్ జిల్లా కేంద్రంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి రాపిడ్ ఓపెన్ (అండర్–13) చదరంగం పోటీల్లో ఎలిగేడు గ్రామానికి చెందిన తాటిపెల్లి విశాల్ ప్రతిభ కనపరిచి మొదటి స్థానంలో నిలిచాడు. జగన్ చెస్ అకాడమీ, ఆర్యవైశ్య సేవాకేంద్రం ఆధ్వర్యంలో సివిల్ సప్లై చైర్మన్ రవీందర్‌సింగ్ చేతులమీదుగా విశాల్ నగదు బహుమతితో పాటు మెమోంటో అందుకున్నాడు. కార్యక్రమంలో ఆర్య వైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కన్న కృష్ణ, అనాయస్ చెస్ అకాడమీ వ్యవస్థాపకుడు కంకటి కన్నయ్య, భరోసా స్వచ్ఛంధ సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు అకినపెల్లి నాగరాజు, కోచ్ కుమార్, నిర్వాహకులు కేశెట్టి జగన్, తాటిపెల్లి సతీష్‌బాబు, కంకటి అనూఫ్‌కుమార్, వంగల సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

రాష్ట్ర హ్యాండ్‌బాల్‌లో ఉమ్మడి జిల్లాకు మూడోస్థానం


మూడోస్థానం సాధించిన బాలుర జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న ప్రభుత్వ విప్ బాల్క సుమన్

కరీంనగర్‌స్పోర్ట్స్: 44వ రాష్ట్ర స్థాయి జూనియర్స్ బాలుర హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు ప్రతిభ కనబరిచి మూడో స్థానాన్ని కైవసం చేసుకుంది. ఈ నెల 7 నుంచి 9 వరకు మంచిర్యాల జిల్లా మందమర్రిలో రాష్ట్ర పోటీలు జరిగాయి. మూడో స్థానం కోసం కరీంనగర్, నల్గొండ జట్లు పోటీపడగా 15–11 స్కోర్ తేడాతో నల్గొండను ఓడించి తృతీయస్థానాన్ని సాధించింది. ప్రభుత్వ విప్ బాల్క సుమన్ ట్రోఫీలు అందజేవారు. జిల్లా జట్టు విజయం సాధించడంపై ఉమ్మడి జిల్లా హ్యాండ్ బాల్ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వరరావు, బసరవేణి లక్ష్మణ్, డీవైఎస్ఓ రాజవీరు, ఒలింపిక్ అధ్యక్ష, కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి, హ్యాండ్‌బాల్ సంఘం బాధ్యులు నమిలికొండ ప్రభాకర్, వేల్పుల సురేందర్, కోచ్ వెంకటేశ్ హర్షం వ్యక్తం చేశారు.

వంతెన నిర్మాణానికి భూసేకరణ


రైతులతో సమావేశమైన తహసీల్దార్

రామగుండం: గోదావరిపై అంతర్గాం–మంచిర్యాల మధ్య నిర్మించే వంతెన కోసం భూ సర్వే పనులు సాగుతున్నాయి. ఇప్పటికే రోడ్లు, భవనాల శాఖ అధికారులు వంతెన వరకు రహదారి కోసం హద్దులను గుర్తించారు. అంతర్గాం శివారులోని సర్వే నంబర్లు 11, 17, 18, 19, గోలివాడ శివారులోని సర్వేనంబర్ 89, 90లోని 18 మంది రైతులకు సమాచారం అందించారు. వారితో అంతర్గాం తహసీల్దార్ వేణుగోపాల్ సమావేశమయ్యారు. మార్కెట్ ధరకు అనుగుణంగా భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందిస్తామన్నారు. సర్వేలో విలేజీఅంతర్గాం, గోలివాడ సర్పంచులు సతీశ్, ధర్ని రాజేష్, సర్వేయర్ అశోక్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్‌రెడ్డి, రైతులు గీట్ల శంకర్‌రెడ్డి, బాలసాని అంజయ్యగౌడ్, రాజేందర్ తదితరులున్నారు.

గుడికోటలో సంక్రాంతి పాట చిత్రీకరణ


కళాకారులను అభినందిస్తున్న మున్సిపల్ చైర్మన్ హన్మండ్లు

రాయికల్: పట్టణంలోని చెన్నకేశవనాథ ఆలయంలో సోమవారం జగిత్యాలకు చెందిన ఎస్వీ మల్లిక్‌తేజ దర్శకత్వంలో సంక్రాంతి పాట చిత్రీకరణ చేపట్టారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మోర హన్మండ్లు, పర్యవేక్షకులు బొమ్మకంటి నాగరాజు, కౌన్సిలర్ మహేందర్, ఆలయ కమిటీ నిర్వాహకులు తుమ్మల సదాశివరెడ్డి, సాంకేతిక నిపుణులు నాగరాజు, మనోజ్, మౌనిక, మహేశ్ పాల్గొన్నారు.

కేజ్‌వీల్స్ ట్రాక్టర్లకు జరిమానా

కోరుట్లరూరల్: కోరుట్ల పట్టణంతో పాటు మల్లాపూర్ మండల శివారులోని తారురోడ్డుపై నడిపిస్తున్న కేజ్‌వీల్స్ ట్రాక్టర్‌ను కోరుట్ల ఎంవీఐ రంజిత్ సోమవారం పట్టుకొని జరిమానా విధించారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.5వేల చొప్పున జరిమానా విధించినట్లు ఆయన పేర్కొన్నారు. రోడ్లపై కేజ్‌వీల్స్ ట్రాక్టర్లు నడిపించడం నేరమని దీంతో రోడ్లు దెబ్బతింటున్నాయని, పొలం పనులు పూర్తయిన తర్వాతే టైర్లతో రోడ్డెక్కాలని ఎంవీఐ పేర్కొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెలు మృతి

సారంగాపూర్: బీర్‌పూర్ మండలం కొల్వాయి గ్రామంలో సోమవారం కుక్కలు దాడిచేశాయి. ఈ దాడిలో ఎనిమిది గొర్రెలు మృతిచెందాయి. మరో 10 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. కొల్వాయి గ్రామానికి చెందిన సంగ గంగన్నకు చెందిన గొర్రెల మందను ఇంటి సమీపంలో చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేసి గొర్రెల మంద ఏర్పాటుచేశారు. కుక్కలు ప్లాస్టిక్ వలను తెంచి మందపై దాడి చేయడంతో అక్కడికక్కడే 8 గొర్రెలు మృతిచెందాయి. మరో పది గొర్రెలు తీవ్ర గాయాలపాలయ్యాయి. ప్రభుత్వం తనకు పరిహారం అందించి ఆదుకోవాలని గంగన్న, ఆయన భార్య లక్ష్మి వేడుకుంటున్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

జగిత్యాలక్రైం: రూరల్ మండలం కల్లెడ గ్రామానికి చెందిన పెద్దూరు మహేశ్ (35) ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో పడి మృతిచెందాడు. కల్లెడకు చెందిన మహేశ్ ఆదివారం వ్యవసాయం పనులకు వెళ్లాడు. కూలీపని చేసి కాళ్లు కడుక్కునేందుకు బావి వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు బావిలో జారిపడి మృతిచెందాడు. కూలిపనులకు వెళ్లిన మహేశ్ సాయంత్రమైన ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు స్థానికంగా గాలించారు. సోమవారం ఉదయం వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యమైంది. మృతుడి తల్లి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై అనిల్ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు

మల్లాపూర్: మండలంలోని నడికుడలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గజ్జి రవి(40)కి తీవ్రగాయాలైనట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని రాఘవపేటకు చెందిన గజ్జి రవి బైక్‌పై మొగిలిపేటకు వెళ్తుండగా, అతివేగంగా వచ్చిన కారు ఢీ కొట్టడంతో బైక్‌పై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడి తమ్ముడు హరీశ్ ఫిర్యాదుతో కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్విట్టర్ వేదికగా కేటీఆర్ అభినందన

కొడిమ్యాల: చొప్పదండి ఎమ్మెల్యే సుంకే రవిశంకర్‌ను ఐటీశాఖ మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా సోమవారం అభినందించారు. నియోజకవర్గంలోని కొడిమ్యాల మండలం అప్పారావుపేటకు చెందిన బీజేపీ కార్యకర్త బుర్ర ప్రవీణ్ తండ్రి గంగరాజు కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతిచెందగా ఎమ్మెల్యే రవిశంకర్ ఆదివారం ప్రవీణ్ ఇంటికి వెళ్లి రైతుబీమా చెక్కును అందించి కుటుంబ సభ్యులతో భోజనం చేశారు. దీనికి సంబంధిచిన పత్రిక కథనాన్ని కేటీఆర్ ట్విట్టర్లో పోస్ట్‌చేశారు. దేశంలో రైతుబీమా అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ రాష్ట్రమని ఇప్పటివరకు 40 లక్షల మంది రైతులకు రైతుబీమా అందించామని పేర్కొన్నారు. ఇతర రాజకీయ పార్టీ కార్యకర్తకు చెందిన కుటుంబ సభ్యుడు మృతిచెందినప్పటికీ స్వయంగా ఇంటికి వెళ్లి చెక్కును అందించడంపై ఎమ్మెల్యేను కేటీఆర్ అభినందించారు.

దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు

మల్లాపూర్ : మండలంలోని పాతదాంరాజుపల్లికి చెందిన రొండ్ల రాములు(40)పై ఆదివారం రాత్రి దాడికి పాల్పడిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన రాములు ఇంట్లోనే కూల్ డ్రింక్స్‌తో పాటు మద్యం విక్రయిస్తున్నాడు. ఆదివారం రాత్రి రాములు అన్న కుమారులు రొండ్ల రవి, రొండ్ల ప్రసాద్ రాములు ఇంటికి వెళ్లి మద్యం కావాలని గొడవకు దిగారు. ఈ క్రమంలో వీరిద్దరు ఖాళీ బీరుసీసాలతో రాములుపై దాడిచేయడంతో తలకు తీవ్రగాయలయ్యాయి. దీంతో కుటుంబసభ్యులు రాములును ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. బాధితుడు రాములు భార్య లలిత ఫిర్యాదుతో నిందితులు ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.